# దిబ్బమతం

దిబ్బ దేశం గురించిన ప్రతిచిన్న విషయంలోనూ నాకుగల ఆసక్తి కొంతమందిని ఆకర్షించినట్టు కనిపిస్తుంది. ఇటీవల దిబ్బ ప్రభుత్వంగారు నూతనమంత్రి వర్గానికి ఇచ్చిన విందు సందర్భంలో ఒక తపస్వి లాటి మనిషి నా పక్కన కూర్చోవటం తటస్థించింది. ఆయన గడ్డమూ, జుట్టూకూడా యధేచ్ఛగా పెరిగి, నెరిసి, తెల్లని పట్టులాగా మెరుస్తున్నాయి. దగ్గిరగా చూస్తే ఆయన ధరించిన కాషాయాంబరాలు కూడా పట్టువేనని తెలిసింది. ఆయన దిబ్బమత ప్రవీణులుగా నాకు పరిచయం చేయబడ్డారు.

"మీ పేరు విన్నాను. మీ రచనలుకూడా కొన్ని చూశాను. మీరు దిబ్బమతానికి గల ప్రాశస్త్యాన్ని ఎక్కడా చిత్రించినట్టు లేదు," అన్నారాయన.

"మతంమీద మనకు కలం సాగదు," అన్నాను.

"దిబ్బమతం ఏమిటో, దాని కథాకమామీషులేమిటో తెలిస్తే మీరు మిగిలిన విషయాలన్నీ వొదిలేసి జీవితాన్ని నాలాగా దిబ్బమతానికే కైంకర్యం చేస్తారు," అన్నారు ప్రవీణులు.

"కాకపోయినా కొత్తరాజ్యాంగంలో మతానికి ప్రాముఖ్యం పోయిందిగదా ?" అన్నాను.

ఆయన నాకేసి జాలిగాచూసి నవ్వి, "మతానికి ప్రాముఖ్యం హెచ్చిందనుకుంటున్నాను," అన్నారు. నా ముఖంలో ఆయనకు ఆశ్చర్యం కనిపించి ఉండాలి. "ఈ రాజ్యాంగం కింద అన్నిమతాలకూ సమాన గౌరవం ఉండేటట్టా ? దేనికి తగిన గౌరవం దానికి ఉండేటట్టా ? చెప్పండి చూతాం!" అన్నారాయన.

నేను కొంచెం కంగారుపడి, "నే నావిషయం ఆలోచించలేదు. దిబ్బరాజ్యాంగం మత విరహితమని అనుకుంటున్నాను." అన్నాను.

"అది చాలా పొరపాటు. మతం సర్వ వ్యాప్తమైనది. అందులోనూ దిబ్బమతాన్ని తప్పించుకు తిరగటం ఎవరికీ సాధ్యం కాదు. చూడండి, దిబ్బరాజ్యాంగాన్ని దేవుడి భాషలోకి తర్జుమా చేశారు—ఆ భాష ఈ నాడెవరూ మాట్లాడకపోయినానూ! దిబ్బరాజకీయ తతంగాలన్నిటికీ దిబ్బమత సంబంధమైన మంత్రాలు చదువుతారు. దిబ్బ అధ్యక్షుడు దిబ్బ మత చిహ్నాలను ధరించిగాని పదవీ స్వీకారం చెయ్యడు. ఎవరైనా దిబ్బ పౌరప్రముఖులుచస్తే దిబ్బ రేడియోలలో దిబ్బమత గ్రంథపఠనం జరుగుతుంది. దీనికే మంటారు?"

నేనేమీ అనలేదు. ఆలోచిస్తున్నాను.

"ఇంకొకటి చెప్పండి, దిబ్బదేశానికి ఇతర మతాలకి చెందిన అధ్యక్షుడు రావటానికి

రాజ్యాంగం సమ్మతిస్తోంది. ఆచారప్రకారం డిబ్బమతానికి సంబంధించిన మంత్రాలు చదవ వలసివస్తే అతగాడు అభ్యంతరం చెప్పగలడా ?"

చెప్పగలడని నాకు తోచలేదు.

"అందుచేత డిబ్బపరిపాలనలో మతప్రసక్తి లేదనుకోకండి. ఇది మత విరహితం ఎన్నటికీకాదు. డిబ్బశాసనాలలో డిబ్బమతం ఉంది. డిబ్బ జాతీయ భాషలోనూ, జాతీయ పతాకాలలోనూ డిబ్బమతం ఉంది."

"మీరు చాలా భయంకరమైన విషయం చెబుతున్నారు. ప్రజాస్వామికంలో మతాతీత లౌకిక రాజకీయాలకు తప్ప తావులేదు. ఏ పాశ్చాత్య రాజ్యమైనా తీసుకోండి," అన్నాను.

"కిరస్తానీమతం అమలుగల చోట అది సాధ్యంకావచ్చు. ఇతరమతాలకూ డిబ్బమతానికీగల పెద్ద తేడా అక్కడే ఉంది. కిరస్తానీమతం రోజుకు కొద్ది నిమిషాలు ఆచరించవచ్చు. డిబ్బరాజ్యం అనుక్షణ ఆచరణీయం. దీన్నుంచి పుట్టినవాళ్ళూ, చచ్చినవాళ్ళూ నిద్రితులూ సయితం తప్పించుకోలేరు. ఆచరణలో అదే వ్యక్తమవుతున్నది."

"పోనీ డిబ్బరాజ్యాంగంలో సర్వమత సమానత్వమైనా ఉన్నదని ఒప్పుకుంటారా ?" అన్నాను.

"అదీకల్లే. ఏ ఇతర మతంకూడా డిబ్బ మతంతో సమంకాలేదు. ఎట్లా అవుతుంది ? డిబ్బమతం డిబ్బ సంస్కృతీ ఆద్యంతాలులేనివి. ఎన్నో మతాలు ఈ మతంపై దాడిచేసి నిర్మూలమైపోయాయి. డిబ్బమతం ఎప్పటిలాగే నిలిచిఉంది. ఈ విషయాలు మనం తాపీగా మాట్లాడుకుందాం. ఇంటి కొకమారు దయచెయ్యండి," అన్నారు ప్రవీణులు.

* * *

డిబ్బమత ప్రవీణుల గారింటికి వరసగా రెండు రోజులు భోజనానికి వెళ్ళాను. రెండుసార్లూ గొర్రెమాంసం వండారు.

"మీరు అగ్రవర్ణులని విన్నాను. శాకాహారులు కారా ?" అన్నాను. శాకాహార నియమం డిబ్బమతంలో ఎక్కడాలేదనీ, పూజ్యులైన 'డిబ్బమునులు మేకలూ, ఆవుదూడలనూ, జింకలనూ, ఒక్కొక్కసారి మానవులనుకూడా ఆహారంగా పుచ్చుకున్నట్టు ప్రాచీన డిబ్బ గ్రంథాలలో సాక్ష్యం ఉన్నదనీ, డిబ్బమతావలంబకులైన యువకులు హేయమైన ఈ జైన ఆచారాన్ని—శాకాహార భోజనాన్ని—మాని మాంసభక్షణంచేసి ఇతరమతాలకు చెందిన మ్లేచ్ఛులను అవసరమైతే నిర్మూలించగల శరీరదార్ఢ్యం కలిగి ఉండాలనీ ప్రవీణులు చెప్పారు.

"మీకు అన్యమత విద్వేషం ఉందని నేను ఊహించలేదు," అన్నాను.

ప్రవీణుల కళ్ళు ఎర్రబడ్డాయి, ఆయన నౌకరుకు ఏదో సంజ్ఞ చేశాడు. నౌకరు ఏదో బుడ్డీ తెచ్చాడు. అందులో ఉన్న ద్రావకం నాకు అనుమానాస్పదంగా కనిపించింది. దాన్ని నాకూ తనకూ రెండు గ్లాసుల్లో కొంచెం కొంచెంపోసి గ్లాసులు నీటితోనింపి అందిస్తూ, "మ్లేచ్ఛమతాలను విధ్వంసం చెయ్యటానికిగాను వాటిని ద్వేషించవలసిన అగత్యంలేదు.

మనకన్నా అవతలవాడు బలవంతుడైనప్పుడూ, వాణ్ణి సందేహించే అధికారం మనకు లేనప్పుడూ ద్వేషిస్తాం. దిబ్బమతాని కటువంటి దుర్దశ లేదు," అన్నారు ప్రవీణులు, ఒక్క గుక్కతో ఖాళీచేస్తూ.

నేను నా గ్లాసు కొంచెం చవిచూసి కిందపెట్టి "మన కొత్త మంత్రివర్గం మద్యనిషేధం ఇంకా బాగా అమలుచేస్తామన్నారు. మీరు పత్రికలు చదివే ఉంటారు," అన్నాను.

"హుఁ! సురాసేవనం లేకుండా దిబ్బజాతికి చెందిన ఆర్యుడు యజ్ఞం ధరించలేడు. ఈ దేశభక్తుల పార్టీకి కించిత్తయినా దిబ్బ విజ్ఞానంలేదు. వీరు ఏ విధంగానూ దిబ్బ సంస్కృతికి ప్రతినిధులుగారు. వీరికి సంస్కృతియొక్క స్వభావాలైనా తెలియవు."

"అయినా మీరూ వారూ సఖ్యంగా ఉండటం చూస్తున్నాను," అన్నాను.

"ఈ దేశభక్తుల పార్టీ భయం మా కెన్నడూలేదు. వీరి అజ్ఞానం మమ్మల్ని బాధించదు. కాని ప్రజలు, ప్రజల అజ్ఞానాంధకారం మాకుపెట్టని గోడగా ఉంది. వారిలో జ్ఞానోదయం కలిగించటానికి మేంచేసే ప్రయత్నాలేమీ ఫలించలేదు. అయిదేళ్ళ క్రితం జరిగిన రక్త యజ్ఞంతో ప్రజలు క్షాళన అవుతారని ఆశించాం. కాని అట్లా జరగలేదు. కాని మాకు తొందరలేదు. దిబ్బమతం అచంచలమైనది, అజేయమైనది."

* * *

దిబ్బమత ప్రవీణుల ద్వారా దిబ్బమత ప్రాశస్త్యాన్ని గురించి చాలా తెలుసుకున్నాను. కాని అది నాకు అర్థమయిందని చెప్పలేను. నిజం చెప్పాలంటే ఈ ప్రవీణులు చాలా భ్రమలపాలై మాట్లాడుతున్నట్టు నాకు తోచింది. దిబ్బమతం అజేయమైనది కాకపోవడమేగాక, అనేకవందల మతాల ప్రభావం దానిపై ప్రసరించినట్టు కనిపిస్తుంది. అది అచంచలమైనది మటుకుకాదు. అనేక ప్రాచీన దిబ్బగ్రంథాలను గురించి తెలుసుకుంటూ ఉంటే దిబ్బమతం అంతులేని మార్పులకు గురి అయినట్టు కనిపిస్తుంది.

ప్రాచీన దిబ్బగ్రంథాలను మనుషులు రాయలేదనీ దేవుడే రాశాడనీ,[2] ఆవిధంగా మానవుడికి దేవుడిభాష లభ్యమయిందనీ, ప్రవీణులు చెప్పారు. ఆ గ్రంథాలలోని అతిప్రాచీన భాగాలు కొన్ని విన్నాను. అందులో నదుల ప్రార్థనలూ, సూర్యోదయాల వర్ణనలూ అవీ ఉన్నాయి. వాటిని రాసింది నిజంగా దేవుడే అయితే ఈ దేవుడు పశువులను కాసినట్టూ, పంటలు పండించినట్టూ, ప్రకృతిని చూసి ఆశ్చర్యపడ్డట్టూ, భయపడ్డట్టూ కనిపిస్తాడు. ఈ ప్రపంచాన్ని తానే సృష్టించానన్న జ్ఞానం ఈ దేవుడికున్నట్టు కనపడదు.

ఈ ప్రాచీన గ్రంథాలలో దిబ్బమత మంతా ఇమిడివున్నదని ప్రవీణుల వాదం. అదే నిజమైనట్టయితే ఇప్పుడు దిబ్బమతం కింద చలామణీ అవుతున్నది దిబ్బమతమే కాదేమోననే

---

1. దేశ విభజన సందర్భంగా జరిగిన మతకల్లోలాల ప్రస్తావన.
2. వేదాలు అపౌరుషేయాలు అని సంప్రదాయం.

సందేహం నాకు కలిగింది.

ప్రవీణులు నాతో ఏకీభవించారు. అసలైన దిబ్బమతాన్ని పునరుద్ధరించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని ఆయన ఒప్పుకున్నారు. దిబ్బమతంలో చెప్పబడిన నాలుగు రంగుల మనుష్యులే తప్ప అయిదో రంగుకు ఆస్కారం లేదని ఒప్పుకుంటూ, ప్రస్తుతం దిబ్బరాజ్యంలో ఉన్న 26, 79, 38 కులాలనూ రద్దు చెయ్యటం అంతతేలిక పని కాదనీ, రంగులూ, కులాలూ ఒకటి కానేకాదనీ, ప్రాచీన గ్రంథాలలో ఎక్కడా చెప్పబడని ఈకులాలను ఉంచటమా, మానిపించటమా అనేది ఇంకా తనకే తెలీదనీ ఆయన అన్నారు.

ఇక్కడ నేనొక్క తెలివి తక్కువ ప్రశ్న వేశాను.

"దిబ్బ సంప్రదాయం ఏమిటి? దిబ్బమతం మనిషిని ఉద్ధరిస్తుందా? లేక మనిషే మతాన్ని ఉద్ధరిస్తాడా? ఇంతకు పూర్వం దిబ్బమతం అచంచలమైనది, అజేయమైనది అన్నారు. ఇప్పుడు దిబ్బమతం ఉద్ధరించబడాలంటున్నారు. ఇందులో ఏది నిజం?" అని అడిగాను.

ఆ ప్రశ్నకు నాకు సరిగా సమాధానం రాకపోగా, నేను ఆ ప్రవీణుణ్ణి మళ్ళీ కలుసుకునే యోగ్యతకూడా లేకపోయింది. దిబ్బమతం గురించి నేనింకా ఎన్నో విషయాలు తెలుసుకుందా మనుకున్నానుగాని తలవని తలంపుగా నా పరిశోధన ఇక్కడ అంతమైనందుకు విచారిస్తున్నాను.

ముద్రణ: 15 జూన్ 1952, ఉదయిని.